మిట్ట మధ్యాహ్నం వేళ రేడియోలో పాతపాట వింటోన్నంత హాయిగా ఉంటుంది ఆరోజు శుక్రవారం అన్న విషయం గుర్తొచ్చిన ప్పుడల్లా.

పాత పాట వింటే రేడియోలోనే వినాలి. ఎందుకంటే మళ్ళీ మళ్ళీ రివైండ్ చేస్కుని వింటాన్కి వీలవ్వదు కాబట్టి. మొదటిసారే మనసుపెట్టి అనుభూతి చెందుతాం దానికోసమే సమయాన్ని వెచ్చిస్తాం.

నా దృష్టిలో రేడియో 'ప్రేయసి' అయితే టేప్ రికార్డర్

# గుడ్ ఫ్రైడే

—ఉరిటి సులేఖ

'శ్రీమతి'. ఎందుకంటే శ్రీమతి ఎప్పుడు కావాలంటే అప్పుడు దర్శనమిస్తుంది. ప్రేయసి ఎప్పుడు అనుగ్రహిస్తే అప్పుడు మనం అప్రమత్తంగా ఉండాలి!

అవి 'అతని' మాటలు! శుక్రవారం వచ్చినప్పుడల్లా ఆ మాటలు గుర్తొస్తాయి. ఆ జ్ఞాపకాలు చుట్టూ కూచుంటాయి. శుక్రవారం ఓ పర్వదినం ఓ పవిత్రదినం! ఆశ్చర్యపోకండి, నే చెప్పబోయే కథ దాంతోనే ముడిపడింది.



క్రిస్టియన్లకి 'గుడ్ ఫ్రైడే', ముస్లిమ్‌లకి పరమ పవిత్ర శుక్రవారం. ఇక హిందువులకు చెప్పనక్కర్లేదు శుక్రవారపు మహాత్యం. అందుకే అనేవాడు కదా 'క్రిస్టియన్లు చర్చికి, ముస్లిమ్‌లు మసీదుకు, హిందువులు దేవాలయానికి వెళ్తే నేను నీ సన్నిధికి వస్తాను'' అని!

ఆ మాటలు యధాలాపంగా పెదాలపై దొర్లినవి కావని! మౌనంగా మనసు అతని కళ్ళల్లోకి వచ్చి సాక్ష్యం చెప్తోన్నట్లుండేవి ఆ చూపులు!

అప్పట్లో ఆ భావన యధార్థమనే నమ్మేదాన్ని నేను. ఇప్పటికీ ఆ ప్రేమ నిజమనే నమ్ముతాను!

కానీ, ఒక్కటే తేడా, అప్పటి నమ్మకం 'సత్యం' అయితే ఇప్పటి నమ్మకం 'భ్రమ'!

'భ్రమ'ని మించిన ఆనందం వేరేదీ లేదు!

''శుక్రవారం అమ్మాయీ స్నానంచెయ్'' టి.వి లో శీకాయ్ ఎడ్వర్టయిజ్‌మెంట్ కన్పిస్తూ విన్పిస్తుంది.

శుక్రవార మహాత్యం టి.వి.లోనూ స్పష్టంగా గోచరమవుతుంది

అదే నా థీమా, 'అతను' భారత దేశంలో ఏమూలున్నా, శుక్రవారం తప్పకుండా 'నే' గుర్తొస్తా. ఎందుకంటే 'వరల్డ్ దిస్ వీక్', 'టర్నింగ్ పాయింట్' వంటి ఢిల్లీ ప్రసారాలు, చిత్రలహరి లాంటి హైదరాబాద్ ప్రసారాలు పదేపదే శుక్రవారపు ఉనికిని గుర్తుచేస్తాయి కనకా!

ఇంతకీ శుక్రవారాన్కి, నాకూ, అతనికి ఉన్న సంబంధం చెప్పాలికదూ! 'అతను' మొట్టమొదటి సారి 'నన్ను' చూసిన రోజు శుక్రవారం! అతను మొట్టమొదటిసారి నాతో 'అయ్ లవ్ యు' అన్న రోజు శుక్రవారం! నాతో ప్రణయ కలహమయిన రోజు శుక్రవారం. మళ్ళీ మధురంగా కల్సిన రోజు శుక్రవారం!

శారీరకంగా కలిసిన రోజు శుక్రవారం, శాశ్వతంగా వీడ్కోలు చెప్పిన రోజు శుక్రవారం! ఇవన్నీ కాకతాళీయమే కావచ్చు! కానీ అక్షరాలా నిజం! అందుకే నా దృష్టిలో శుక్రవారానికి అంత ప్రాముఖ్యత! అప్పట్లో ప్రతి శుక్రవారం మేం



కలుసుకునే వాళ్ళం. ఒకవేళ ఏ పని మీదున్నా, అతను 'బిజీ'గా ఉంటే ఫోన్‌చేసి మాట్లాడేవాడు!

"నే ఎప్పుడన్నా గుర్తొచ్చానా?" అని నేనడిగితే 'ఓహ్ శుక్రవారం తప్పకుండా గుర్తొస్తావ్' అనే వాడు సీరియస్‌గా. "అంటే ఒక్క శుక్రవారమేనా?" అని నే అలిగినట్టు మొహం పెడితే "అయ్యో కాదు శుక్రవారం ఎంత పని ఉన్నా చాలాచాలా గుర్తొస్తావ్" అంటూ గెడ్డం పట్టుకుని బుజ్జగించేవాడు.

పాపం 'అతను' మంచాడే. పరిస్థితుల ప్రభావం! కాల ప్రభావం! దేనికన్నా 'కాలం' కలిసిరావాలి.

నన్ను చూడకపోతే గెడ్డం కూడా గీసుకోని 'అతడే' నన్ను ఏం కానట్టే 'వదిలేశాడు'!

అయినా 'వదిలెయ్యటం' ఏంటి? అతడేమన్నా నన్ను పెళ్ళాడాడా? 'ప్చ్' అదేం లేదు! పోనీ ఎప్పుడన్నా పెళ్ళిచేస్కుంటానని ప్రమాణం చేసాడా? ఊహూ, అదీ లేదు! జీవితాంతం ఉంచుకుంటానని మాటిచ్చాడా? అబ్బే అదేం కాదు! అందుకే అతడు మోసగాడంటే నా మనసొప్పుకోదు! నన్ను ప్రేమించానని మాత్రం చెప్పాడు. అంతే! ప్రేమించినంత మాత్రానా జీవితాంతం ఒకే మూరుకింద కల్సి ఉండాలన్న నిబంధనేం లేదు కదూ?

అతడు నన్ను పెళ్ళి చేస్కోడన్న విషయం మాకు పరిచయమయిన క్షణమే నాకు తెల్సు.

అయినా 'అతడు' నాకు ప్రాణం. మీరు నాకు 'వెర్రి' అనుకోవచ్చు. 'పిచ్చిది' అని నవ్వుకోవచ్చు.

ఏమన్నా అనుకోండి! నే ఖాతరు చెయ్యను!

అయినా 'అతడు' నన్నెందుకు పెళ్ళిచేస్కుంటాడు? నేను చూట్టానికి పెళ్ళికాని అమ్మాయిలా ఆకర్షణీయంగా కన్పిస్తున్నా, ఓ కొడుక్కి తల్లిని. అందునా విధవని!

పాపం ఓమారు అతనే అన్నాడు నన్ను పెళ్ళాడుతానని. అది మాత్రం పెదాలపై యథాలాపంగా దొర్లిన మాటలే అవి, అతని కళ్ళల్లో దూరిన మనసు చెప్పింది. కానీ, ఆ 'పిచ్చి నిజాన్ని' జీర్ణించుకునే శక్తి నాకులేక నివారించాను.

'యీ దీనురాలికోసం అంత త్యాగం చేయకండి. మీకెంతో భవిష్యత్తుంది. మీ వంశాన్ని నిలబెట్టేందుకు ఓ వంశోద్ధారకుడు మీకు పుట్టాలి. ఆ అర్హత నాకు లేదు'' అంటూ తెగ బాధపడిపోతూ కృతజ్ఞతలు చెప్పుకున్నా.

మొదట్లో 'అతడు' అంత చొరవ చూపించేవాడు కాదు. అతడి ప్రవర్తనతో నా అంతరంగంలో రోజు రోజుకూ మహోన్నతుడుగా ఎదిగి పోతుండేవాడు.

అతడి పవిత్ర ప్రేమకు తెగ సంబరపడిపోతూ శుక్రవారంనాడు నేనే మహా ఆనందంగా అర్పించేస్కున్నా. అదేదో మహా త్యాగంలా అన్పించింది.

అది కూడా భలే గమ్మత్తుగా జరిగింది. మొదట అతడు వద్దన్నాడు. తర్వాత భయం వల్లేమో బిగుసుకుపోయాడు. క్రమేణా అన్నీ నా దగ్గరే నేర్చుకున్నాడు. తర్వాత గడిచిన ప్రతి శుక్రవారం మేం కల్సేవాళ్ళం. మొదట్లో అనుకోకుండా మేం కల్సినరోజు శుక్రవారం అయితే తర్వాత్తర్వాత శుక్రవారం కావాలనే మేం కల్సేవాళ్ళం.

అతడు కేవలం 'దాన్ని', అభ్యపించటానికే నా




# ఝడుపు కథల పోటీ

వెయ్యాలంటే భయం.
హింసంటే భయం.
ప్రాణం పోతుందంటే భయం.
భయం భయం భయం...

'భయం' ఇతివృత్తంగా ఆంధ్రభూమి కథల పోటీ నిర్వహిస్తోంది.

కథకు సస్పెన్స్, భయంకర వాతావరణం ముఖ్యమని వేరే చెప్పక్కర్లేదు.

ఈ సరికొత్త కథల పోటీలో రచయిత (త్రు)లు ఉత్సాహంగా నిర్భయంగా పాల్గొనాలని విజ్ఞప్తి.

మంచి కథలకు మంచి బహుమతులిస్తామని ఆంధ్రభూమి అభయం!

ఇంకేం! వెంటనే పాల్గొనండి!

- ఫస్ట్ ప్రయిజ్ 3000
- సెకండ్ ప్రయిజ్ 2500
- థర్డ్ ప్రయిజ్ 2000
- ఫోర్త్ ప్రయిజ్ 1000
- 3 కన్సొలేషన్ బహుమతులు ఒక్కొక్కటి రు.500

● పోటీకి నియమ నిబంధనలు:

*కథ ఆరు పేజీలకు మించరాదు.

*కాగితానికి ఒకవైపునే పెన్‌తోగానీ, బాల్ పెన్‌లోగానీ రాయాలి.

*స్వంత రచనలై వుండాలి. అనువాదాలు, అనుసరణలు పనికిరావు.

*బహుమతి పొందని కథల్లో నచ్చినవాటిని ఆంధ్రభూమి సచిత్రవార పత్రిక, మాసపత్రిక, దినపత్రికల్లో ప్రచురించే హక్కు మాకుంటుంది.

*పోటీకి పంపే రచనమీద 'ఝడుపు కథల పోటీ' అని స్పష్టంగా రాయాలి.

*ప్రచురణకు స్వీకరించని కథలను తిప్పి పంపాలంటే తగిన స్టాంపులంటించిన కవరు తప్పనిసరిగా జతచేయాలి.


*కథల ఎన్నిక విషయంలో తుది నిర్ణయం ఎడిటర్‌దే. దీనిపై ఉత్తరప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.

*ప్రతి కథ చివరా రచన సొంతమేనని, ప్రసారం కానీ, ప్రచురణ కానీ కాలేదని హామీ వుండాలి.

*కథ బాగున్నా పై నిబంధనలు పాటించకపోతే రచనలు పోటీకి పరిశీలించడం జరగదు.

*కథలను ఎడిటర్, ఆంధ్రభూమి సచిత్రవార పత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్: 500 003 అనే చిరునామాకు పంపాలి.

✽ పోటీ కథలు చేరవలసిన ఆఖరు తేదీ 94 జనవరి 31.



## వేధింపు

"వేధింపు ముందు పుట్టి ఆడది తర్వాత పుట్టిందేమో. అందుకే ఆ వాణీని వొదిలింకోవాలనుకుంటున్నా" కోపంగా అన్నాడు హరి.

"ఇంతకీ ఏమని వేధిస్తోంది?" అడిగాడు గిరి.

"పెళ్లి చేసుకుందామని ఒకటే గొడవ" విరాగ్గా చెప్పాడు హరి.

—అగస్త్య పగడ రోహిణి
(కేశవపల్లి)

వద్దకు వచ్చేవాడని, అతడు నన్నో, 'స్పెసిమెన్'లా వాడుకున్నాడనో అప్పట్లో నా కర్థమయినా నా 'మనసు' కిమ్మనకుండా ఊర్కునేది.

ఎందుకంటే అప్పట్లో దానికీ ఓ విధమయిన తృప్తి ఉండేది. కానీ, ఇప్పుడదే మనసు ఆ విషయాన్ని పదేపదే గుర్తు తెచ్చుకుంటూ రొద పెడ్తోంది!

అసలు మేం ఎట్లా విడిపోయామంటే, ఓ రోజు, శుక్రవారమే అనుకోండి. 'అతడు' మా ఇంటికి హడావుడిగా వచ్చాడు.

"ఏంటి సంగతి?" అన్నా ఆశ్చర్యపోతూ. ఎందుకంటే సర్వసాధారణంగా ఫోన్ చెయ్యకుండా అతడెప్పుడూ ఇంటికిరాడు. "నువ్వు, సంతూర్ సోప్ వాడతావా?" అన్నాడు సంభాషణ కుపక్రమిస్తూ.

"యీ రోజు నీకెవన్నా పిచ్చి పట్టిందా?" అన్నా నవ్వుతూ. "అలా నవ్వకు. నే సీరియస్‌గా అడుగుతున్నా. నీ సౌందర్య రహస్యం ఏంటి?" అన్నాడు మళ్ళీ.

"చెప్పనా!" అన్నా నేను కళ్ళు వాల్చుకుని.

"ఆ" అంటూ ఆసక్తిగా ముందుకు వంగాడు. "మైండ్‌ని ఎప్పుడూ యూత్‌ఫుల్‌గా ఉంచుకోడం, ఎల్లప్పుడూ నీ ఆలాపనల్లోనే మిగిలిపోటం" అన్నా మనస్ఫూర్తిగా.

"థాంక్యూ వెరీ మచ్" అంటూ నా చేతిని ప్రేమగా నొక్కాడు. అతడెప్పుడూ అసభ్యంగా ప్రవర్తించేవాడు కాదు. ఆబగా 'ఏదో' పొందెయ్యాలన్న ఆరాటం కన్పించేది కాదు! తొంభై తొమ్మిది శాతం ప్రేమంటే ఒక్కశాతం మాత్రమే 'కామం' ఉందేమో అన్పించేటట్టుండేవాడు.

అందుకే అతడికి దాసోహమవ్వటంలో నేను ఓ విధమైన తృప్తినే పొందేదాన్ని! యిప్పుడనిపిస్తోంది అంత చాకచక్యంగా నన్ను వశపర్చుకోడం అతని గ్రేట్‌నెస్ అయితే, అంత తేలికగా మోసపోడం నా



కారు

"హలో అప్పారావ్! కారు కొన్నావట"

"అవునోయ్! మరి నడుచుకుంటూ వెళ్తుంటే అప్పులాళ్లు వెంటబడుతున్నారుగా, అందుకని"

— విలువేరు మృత్యుంజయ
(భూదాన్‌పోచంపల్లి).

వికనెస అని!

"ఈ రోజేమయిందో తెల్సా? పెళ్ళి చూపులకని వెళ్ళి ఓ అమ్మాయిని చూశాను. అంత ఫ్రెష్ అయినా నీలోవున్న 'చామ్‌' ఆ అమ్మాయిలో నాకు కన్పించలేదు. అందుకే "తెరే చెహరేమే ఓ జాదూ హై" అంటూ కూనిరాగం తీస్తూ నా పక్కన కూచున్నాడు. ఆ పొగడ్త నాకెంతో గర్వంగా తోచింది.

ఇంకో శుక్రవారం అతనిపెళ్ళింకా మూడే మూడ్రోజులుంది. నాకెందుకో ఎక్కడలేని నిస్పృత్తు నా కల్గుతోంది. అతడూ విచారంగా కన్పడ్డాడు. జీవితాంతం నాదగ్గరికొస్తానని మాటిచ్చాడు. నన్ను చూడకుండా ఉండలేనన్నాడు.

నాతోనే ఊపిరన్నాడు. "మనసిక్కడ కట్టె అక్కడ" అన్నాడు! కమ్మని కబుర్లతో కాంక్ష తీర్చుకున్నాడు! యిప్పుడవే కల్లబొల్లి కబుర్లేమో అన్పిస్తోంది.

అదే ఆఖరి శుక్రవారం! తర్వాతోరోజు దార్లో కన్పించి అతని భార్యని పరిచయం చేసాడు. ఆమె తన సర్వం అన్నట్లుంది అతని ధోరణి! అప్పటికీ అతని మీద నాకు కోపం రాలేదు!

"నేను ప్రేమించినంత మాత్రాన అతనూ ప్రేమించాలని రూలేం లేదు కదూ" అనుకుని నన్ను నేనే సర్దిపెట్టుకున్నా.

తర్వాత ఓ రెండేళ్ళు గడిచాయి. ఏ శుక్రవారమూ ధైర్యంచేసి అతనికి ఫోన్ చేసేదాన్ని కాదు. ఒహవేళ అతను పట్టించుకోనట్టు ప్రవర్తిస్తే శుక్రవారపు సెంటిమెంటు దెబ్బతింటుంది! ఏ శనివారమో ఫోన్ చెయ్యటం అతను పనిలో ఉన్నట్టు చెప్పడం, ఆ గొంతులో తారాడుతున్న విసుగు నన్ను కలవరపెట్టేది.

అతని విరహంలో కొంతకాలం బాధపడ్డా, నెమ్మదిగా కోలుకోసాగాను మనసును తక్కిన విషయాల మీద లగ్నం చేస్తూ.

ఆనందరావుతో పరిచయం అయ్యి ఓ సంవత్సరం అయ్యింది. ఎందుకో మరి అతన్ని చూడగానే ఓ ఆత్మీయుడ్ని చూసినట్టే అన్పిస్తుంది కానీ ఎటువంటి అలజడి కల్గదు. ఓ మంచి స్నేహితుడు గుర్తొస్తాడు కానీ హృదయాన్ని దోచే ప్రియుడిలా తోచడు. మరది దృష్టిలోపమో, లేక అతని లోపమో!

ఆ అలౌకిక స్పందన 'అతడి' వద్ద మాత్రమే లభ్యమవుతుంది. బహుశా అదేనేమో ప్రేమంటే! అతడు విషమిచ్చినా అమృతమే! అందుకే ప్రేమ ఓ భ్రమ! ఓ ఉన్మాదం!

ఈ రోజు శుక్రవారం. సాయంత్రం అయిదింటికి ఆనందరావు వస్తానన్నాడు. అతన్ని పెళ్ళి చేస్కోవడాన్కి నా అభిప్రాయాన్ని చెప్పమన్నాడు. అయిదవ్వటాన్కి ఇంకా అరగంటుంది. యింతవరకూ ఏ నిర్ణయాన్నీ తీస్కోలేకపోతున్నా.

'దినాల' ఫలితాన్ని చెప్పే పుస్తకాన్ని తిరగేస్తున్నా, అనుకోకుండా శుక్రవారం ఫలితాన్ని చూసాను.

శుక్రవారం శుభ ఫలితం.

ఏ పనన్నా దిగ్విజయంగా జరుగుతుంది. ముఖ్యంగా ప్రేమికులు కల్సుకోటాన్కి, ప్రేమను తెల్పుకోటాన్కి శుభప్రదం! అనుకోకుండానే నా జీవితంలో 'ప్రేమ' విషయంలో శుక్రవారపు దిన ఫలితం అక్షరాలా జరగటం ఇప్పటికీ నాకాశ్చర్యమే! ఒక్కసారి 'అతడు' గుర్తొచ్చాడు. మరుక్షణం 'అతన్ని' మర్చిపోవాలని నిశ్చయించుకున్నా. నన్ను ప్రేమించని 'అతని'కోసం నేనెందుకింత వెంపర్లాడటం! నన్ను ప్రేమించే ఆనందరావుని పెళ్ళి చేస్కోవాలనే నిశ్చయించుకున్నా. అంతలో తలుపు చప్పుడయ్యింది.

అయిదవుతోంది. ఆనందరావే వచ్చుంటాడు. తలుపు తెరిచా. ఎదురుగా అతడు!

అతని పదసవ్వడి నా గుండె మీద కదం తొక్కుతున్నట్టు విపరీతంగా కొట్టుకోసాగింది. అప్రయత్నంగా కాళ్ళు వణకసాగాయి.

అది ఉత్సాహమో? ఉద్వేగమో?

అతడు మునపట్లా లేడు! నెరిసిన జుట్టు, నల్లబడ్డ మొహం, ముడతలుపడ్డ నుదురు, కొంచెం పైకివచ్చినట్టు పొట్ట, లోతుకు పోయిన కళ్ళు!

లోపలికి వచ్చి కూచున్నాడు. కొద్దిసేపటి మౌనం తర్వాత చెప్పాడు "అయామ్ సారి, నిన్ను చూడకుండా ఇంతకాలం ఎట్లా ఉన్నానో నాకే తెలీదు! నువ్వు నా ప్రాణం అన్నది నిజం" అంటూ నాకళ్ళల్లోకి చూసాడు. అతని చూపుల్లోని మనసు ఆ మాటలు 'నిజమే' అన్నట్లు సాక్ష్యం చెప్తోంది. అలా అని నా కన్పించింది అంటే బావుంటుందేమో! "నువ్వు ఒప్పుకుంటే మనం జీవితాంతం కల్సివుందాం" అన్నాడు నాకళ్ళల్లోకి చూస్తూ.

"నే ఒప్పుకోడం ఏంటి? నువ్విలా నన్ను వెతుక్కోనిరాటమే నా భాగ్యం. జీవితాంతం నీ పాదాల దగ్గరే మిగిలిపోతా" మనస్ఫూర్తిగా మనసులోనే అనుకుని నా భావం అతనికి అర్థమయ్యేలా ప్రేమగా చెయ్యి పట్టుకున్నా.

"థేంక్యూ, థేంక్యూ వెరీమచ్. నిజంగా నువ్ దేవతవి. నాతోపాటు, నా కొడుకు బాధ్యత కూడా నీదే. ఎందుకంటే కిందటి నెలే నా భార్య చనిపోయింది" కళ్ళు దించుకుంటూ చెప్పాడు.


అతను మనసు చెప్పే సాక్ష్యాన్ని చూద్దామని ప్రయత్నించినా లాభం లేకపోయింది — కళ్ళు కిందకి వాలి ఉండడం వల్ల!

ఒక్కక్షణం మనసు చివుక్కుమంది.

ఈసారి ఆ చూపుల్ని చూసి మోసపోదల్చుకోలేదు. అందుకే విసురుగా అతని చేతిని తోసేసాను. దెబ్బతిన్న పక్షిలా దీనంగా నావైపు చూసాడు. ఆ చూపులు "నాకు నువ్వే దిక్కు!' అన్నట్టున్నా, నాకు మాత్రం 'నాకు నువ్వే ప్రాణం!' అన్నట్టన్పించాయి ఎప్పట్లానే. అంతే నన్ను నేనే తిట్టుకుంటూ అతన్ని దగ్గరికి తీస్కున్నా.

యిది అతని గ్రేట్‌నెస్సా? నా వీక్‌నెస్సా?

యిది అతని గొప్పతనం కాదు! నా బలహీనత! అని నేననుకుంటూంటే అతడు నా చెవిలో నెమ్మదిగా చెప్పాడు "ఈ రోజు గుడ్‌ఫ్రైడే. వెరీ గుడ్‌ఫ్రైడే" ఇప్పుడనిపిస్తోంది ఇది ప్రేమ గొప్పతనం! *






ఏకసంథాగ్రాహి

నటీమణిగా ఉన్నప్పటినుంచీ, జయలలిత ఎంత పెద్ద డైలాగు పేపరు ఇచ్చినా, ఎన్ని పేజీలున్నా ఒకసారి ముందూ వెనుక చూసుకుంటే చాలు. 'షాట్'లో కొట్టొచ్చినట్టు డైలాగులతో సహా గుర్తుంచుకుంటుంది. ఇదే అలవాటు రాజకీయాల్లోనూ ఉపయోగపడుతోంది. ఎంతమంది ఎన్ని మెమొరాండంలు ఇచ్చినా అన్నిటినీ ఓపిగ్గా ఒకసారి మీదనుంచి క్రిందకు చూసిందంటే చాలు 'టైప్' అయిపోయినట్టే!

— సాయిరాం